క్లుప్తంగా

ఎల్‌ఓసీ చెక్కు అందజేత

హాలియా : మండలంలోని శ్రీనాథపురం గ్రామానికి చెందిన పాల్వాయి రవి అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆర్థిక పరంగా ఇబ్బందులు పడుతున్నాడు. ఈ విషయాన్ని స్థానికులు ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ. 2లక్షల ఎల్‌ఓసీ చెక్కును మంజూరు చేయించారు. ఆ చెక్కును శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అందజేశారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

కొండమల్లేపల్లి : ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్‌ఐ అజ్మీరా రమేష్ తెలిపారు. శుక్రవారం మండలంలోని చెన్నారం గేటు వద్ద ఉన్న మూలమలుపుల్లో రోడ్డు పక్కన పెరిగిన పిచ్చి చెట్లను జేసీబీ సహాయంతో తొలగించారు. వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని, లేనిపక్షంలో చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బాధితురాలికి ఆర్థిక సాయం

గుర్రంపోడు : మండలంలోని కట్టవారిగూడెం గ్రామంలో షేక్ సఫియా మానసిక వ్యాధితో అనారోగ్య భారిన పడగా చికిత్స నిమిత్తం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో శుక్రవారం వీధి వీధి తిరుగుతూ విరాళం సేకరించారు. సేకరించిన రూ.45 వేల నగదును వైద్య ఖర్చులకు కోసం బాధితురాలి తండ్రి షేక్ సయ్యద్ మియాకు అందించారు. బాధితురాలిని ఆదుకునేందుకు ముందుకు వచ్చిన గ్రామస్తులను పలువురు అభినందించారు. ఇంకా ఎవరైనా దాతలు ఉంటే స్పందించి ఆర్థికసాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చాడ చక్రవర్తి, మల్లెబోయిన శ్రీను, చాడ మల్లేషం, పర్సనబోయిన వెంకన్న, కట్ట వెంకన్న, కట్ట నర్సింహ్మా, ఏడుకొండలు, కట్ట యాదయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

గుర్రంపోడులో భారీ వర్షం

గుర్రంపోడు : మండలంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షంతో వాగులు ప్రవహిస్తున్నాయి. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ జలమయం అయ్యాయి. వర్షాలు, ఏఎమ్మార్పీ కాల్వల నీటితో కుంటలు, చెరువులు అలుగులు పోస్తున్నాయి. వర్షాలతో పత్తి, వరి రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

అధిక వర్షపాతం నమోదు

నిడమనూరు : నిడమనూరు మండలంలో అధిక వర్షపాతం నమోదైంది. శుక్రవారం ఉదయం వరకు 5.57 సెంటీమీటర్ల వర్షం కురిసింది. మొత్తంగా గత 24 గంటల్లో 10 సెంటీ మీటర్లకు పైగా వర్షం నమోదైంది. అధిక వర్షంతో తుమ్మడం, ఊట్కూరు, మారుపాక, నిడమనూరు చెరువులు మత్తడి దూకుతున్నాయి. లో లెవల్ కల్వర్టులపై నుంచి వరద ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. తుమ్మడం-పార్వతీపురం, రాజన్న గూడెం-వెనిగండ్ల, నిడమనూరు-బంకాపురం గ్రామాల మధ్య వరదతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

విద్యుతాఘాతంతో మేకలు మృతి

త్రిపురారం : రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తెగిపడి మేకలు మృతిచెందాయి. ఈ సంఘటన శుక్రవారం మండలంలోని నీలాయిగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నీలాయిగూడెం గ్రామానికి చెందిన గందం ముత్తయ్య తన మేకలను రోజు మాదిరిగా రాత్రి మేకల దొడ్డిలో ఉన్న ఇనుప కంచెను తాళ్లతో కట్టివేశారు. దీంతో రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా విద్యుత్ తీగలు తెగిపడి మేకల దొడ్డికి ఉన్న ఇనుప కంచెపై పడ్డాయి. దీంతో మేకలు మృతిచెందాయి. వాటి విలువ సుమారు రూ. 50వేలు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవం

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా 'పోషణ, సంరక్షణలో తండ్రుల భాగస్వామ్యం' అనే అంశంపై సూపర్ వైజర్ రూపావత్ వాణి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నాగురుబి, లక్ష్మి, సత్యలక్ష్మి, భాగ్య లక్ష్మి, హెల్పర్ అరుణ, దేవమ్మ, శశికళ ఉన్నారు.

ఏఎస్పీ విచారణ

పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని దుగ్యాల గ్రామానికి చెందిన ఎర్ర కలమ్మ కుమారుడు చంద్రబాబు అదే గ్రామానికి చెందిన యువతిని కులాంతర వివాహం చేసుకున్నాడు. ఈ నెల 23న కుంభం ఆంజనేయులు, అతడి కుటుంబ సభ్యులు చంద్రబాబు తల్లి కలమ్మపై దాడి చేయడంతో గుడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు శుక్రవారం దేవరకొండ ఏఎస్పీ మౌనిక దుగ్యాలలో విచారణ చేపట్టారు. ఆమె వెంట సీఐ నవీన్‌కుమార్,ఎస్‌ఐ నర్సింహులు తదితరులున్నారు.

మహాలక్ష్మీదేవి అవతారంలో దుర్గామాత

దేవరకొండ : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు దేవరకొండలో కొనసాగుతున్నాయి. శుక్రవారం ఆయా మండపాల వద్ద మహిళలు కుంకుమ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని మార్కండేయ స్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి భావం పెంపొందించుకోవాలని ఆయన కోరారు.

మహాలక్ష్మి అవతారంలో అమ్మవారు

హాలియా : దేవీశరన్నరాత్రి ఉత్సవాల్లో సందర్భంగా శుక్రవారం దుర్గామాత శ్రీమహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. హాలియా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారిని శ్రీ మహాలక్ష్మీదేవీ రూపంలో కొలిచారు. ఈ సందర్భంగా హాలియా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్ యూత్ సభ్యులు చవ్వాకుల రాజు, వడ్డె సతీష్‌రెడ్డి, గడ్డం సోము, రావులపాటి ఎల్లయ్య, సైదులు, బాలకృష్ణ, నవీన్, క్రాంతిచారి, వర్కాల సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీదేవి అలంకరణలో కొలువుదీరిన అమ్మవారు



మిర్యాలగూడ : యాద్గార్‌పల్లిలోని కనకదుర్గ ఆలయంలో మహాలక్ష్మి అవతారంలో అమ్మవారు



హాలియా : బస్టాండ్ వద్ద దుర్గామాత పూజలో పాల్గొన్న భక్తులు



మిర్యాలగూడ టౌన్ : ముత్తిరెడ్డికుంటలో కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు



పెద్దవూర : దుర్గాంభికా దేవాలయంలో అమ్మవారికి కుంకుమార్చన చేస్తున్న భక్తులు

నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేయాలి

- మంత్రి సీతక్కకు ఎమ్మెల్యే వినతి

మిర్యాలగూడ : నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమీక్షసమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మంత్రి సీతక్కను కలిసి మాట్లాడారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల కోసం ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల నుంచి రూ.25కోట్లు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క స్పందిస్తూ త్వరలోనే నిధులను విడుదల చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

పోషకాహారంతో ఆరోగ్యం

గుర్రంపోడు : బలవర్ధకమైన పోషకాహారం తీసుకోవడం ద్వారా గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని గైనకాలజిస్టు డాక్టర్ హరిప్రియ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో స్వస్త్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు, బాలింతలకు వైద్య శిబిరం నిర్వహించారు. 60 మంది మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ అరుందతి మాట్లాడుతూ మంచి పోషకాహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకొని వైద్యుల సలహాలు పాటిస్తే తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ భవానీ చక్రవర్తి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పోషణ మాసం

నకిరేకల్ : పోషణ మాసంలో భాగంగా నకిరేకల్ మండలం ఓగోడు అంగన్‌వాడీ కేంద్రంలో సెక్టర్ లెవల్‌లో శుక్రవారం తక్కువ ఖర్చులో ఎక్కువ పోషకాలు లభించే వంటకాల ప్రదర్శన చేపట్టారు. ఈ వంటకాలు అందరిని ఆకట్టుకున్నాయి. వాటి గురించి మహిళలకు అవగాహన కల్పించారు. ఆ తరువాత బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవాని, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.



గుర్రంపోడు: పీహెచ్‌సీలో పోషకాహారంపై సూచనలిస్తున్న వైద్యులు

పేదల సొంతింటి కల సాకారం

- ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కలను నెరవేరుస్తోందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం దేవరకొండ మండలం మైనంపల్లి కొర్రతండాలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బడుగు, బలహీన వర్గాల కోసం ఎన్నో సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని ఆయన గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ప్రభుత్వం పారదర్శకంగా పని చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు దరిచేరుతాయని పేర్కొన్నారు. దేవరకొండ నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రమణారెడ్డి, ఎంపీడీఓ డానియల్, ఆలంపల్లి నర్సింహ, నాయిని మాధవరెడ్డి, పున్న వెంకటేష్, మారుపాకల సురేష్‌గౌడ్, రాంసింగ్, సీత్యానాయక్, వెంకటేష్‌గౌడ్, పాండునాయక్, తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే

'మలబార్'లో నక్లెస్ మేళా

మిర్యాలగూడ : పట్టణంలోని సాగర్ రోడ్డులోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంలో శుక్రవారం నక్లెస్ మేళాను స్టోర్ హెడ్ సమీర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ మలబార్ బ్రాంచ్ షోరూంలో వినియోగదారులకు కావాల్సిన వివిధ రకాల నక్లెస్ డిజైన్లు ఉన్నాయని తెలిపారు. వినియోగదారులు షోరూంకు వచ్చి తమకు నచ్చిన డిజైన్లను సెలక్ట్ చేసుకోని కొనుగోలు చేయాలని కోరారు. ఈ మేళా అక్టోబర్ 5వరకు ఉన్నందున వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ సంపత్, వినియోగదారులు కవిత, ప్రియ భారతి, ప్రవళిక, శైలజ, మాదురి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నక్లెస్ మేళాను ప్రారంభిస్తున్న స్టోర్ హెడ్ సమీర్

తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ జయంతి

కొండమల్లేపల్లి(చింతపల్లి) : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ జీవితం నేటి తరం మహిళలకు స్ఫూర్తిదాయకమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని గడియగౌరారం గ్రామంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మిర్యాలగూడ : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా శుక్రవారం బీఆర్ఎస్, బీజేపీ, బీసీ సంక్షేమ సంఘం, బీసీ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రజువారం ఘనం నిర్వహహించారు. కార్యక్రమాల్లో దుర్గంపూడి నారాయణరెడ్డి, కుందూరు వీరకోటిరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాస్‌రావు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి మున్సిపల్ కమిషనర్ జి. శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ వెంకన్న, ఆర్‌ఓ జ్ఞానేశ్వరి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, ఆర్‌ఐ సాంబయ్య, పోతెపాక బక్కయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

హాలియా : తెలంగాణ సాధనలో ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకమని రజక సేవా సంఘం అనుముల మండల అధ్యక్షుడు నారాయణదాసు అంజయ్య, మాజీ సర్పంచ్ జూపల్లి శ్రీనివాస్ అన్నారు. రజక సేవా సంఘం, ల్యాండ్రీ షాపు వృత్తిదారుల ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వట్టికోటి శ్రీను, జూపల్లి నాగరాజు, దామెర్ల శ్రీను, రేబెల్లి వెంకటేశ్వర్లు, అనుముల దుర్గయ్య, దుండిగల శ్రీను, అనుముల అనిల్ కుమార్, ఈదమ్మ, గౌరమ్మ ఉన్నారు.

పెద్దవూర: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శాంతిలాల్, రాజశేఖర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి తహసీల్దార్ రాగ్యానాయక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్‌ఐ శ్యాం, సిబ్బంది సాయి, స్వామి, నాగయ్య తదితరులు ఉన్నారు.

నాగార్జునసాగర్ : చాకలి ఐలమ్మ 130వ జయంతిని రజక సేవా సంఘం అధ్యక్షుడు భూషరాజుల కృష్ణయ్య, కార్యదర్శి ఊర శ్రీనివాస్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జంగయ్య, దుర్గయ్య, వెంకటేశ్వర్లు, వేణు, నందికొండ సత్యం, రమేశ్‌జీ, చంద్రమౌళి పాల్గొన్నారు.

దేవరకొండ : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా శుక్రవారం ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ రమణారెడ్డి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిబ్బంది ఆయూబ్, హరీష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాస్కరాచారి, రంజాన్‌బేగ్, శాంసన్, భిక్షమయ్య, వీరయ్య, బాషానాయక్, బాబా, తదితరులు పాల్గొన్నారు.



ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్



నాగార్జున సాగర్ : హిల్‌కాలనీలో..

అసిస్టెంట్ ఆడిట్ అఫీసర్‌గా శ్రీచైతన్య

మిర్యాలగూడ టౌన్ : మండలంలోని తడకమళ్ల గ్రామానికి చెందిన అనంతుల శ్రీ చైతన్య గురువారం వెలువడిన గ్రూప్-1 ఫలితాల్లో అసిస్టెంట్ ఆడిట్ ఆఫసర్‌గా ఎంపికయ్యాడు. వీరి తల్లి దుర్గాభవాని మిర్యాలగూడ కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తుండగా తండ్రి తడకమళ్ల గ్రామంలోని పీఏసీఎస్ సెక్రటరీగా పనిచేస్తున్నాడు. శ్రీచైతన్య ఒకటో తరగతి నుంచి ఆరో తరగతి వరకు పట్టణంలోని న్యూ జనరేషన్ స్కూల్, ఏడో తరగతి నుంచి 10వ తరగతి వరకు ఇన్‌స్పేర్ స్కూల్‌లో చదివాడు. ఇంటర్మీడియేట్‌ను మాదాపురంలోని శ్రీ చైతన్య కళాశాలలో, ఎన్ఐటీ వరంగల్‌లో చేశాడు. ఆతరువాత మొదటి ఫలితాల్లోనే అసిస్టెంట్ ఇంజనీర్‌గా, రెండోసారి అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్‌గా ఉద్యోగాలను సాధించాడు, కానీ ఆ ఉద్యోగాలకు వదిలి పట్టుదలతో చదవగా మహేశ్వరపురంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ గెజిటెడ్ లెక్చరర్‌గా ఉద్యోగం రావడంతో ఉద్యోగం చేస్తూనే నాల్గోసారి అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించాడు. పెద వెంకయ్య కోరిక మేరకు తాను కలెక్టర్ కావాలనే లక్ష్యంతో ఉన్నారని తెలిపారు.తన విజయం వెనుక తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల ప్రోత్సహం ఉందని తెలిపాడు.



ఎ. శ్రీచైతన్య

ఎంపీడీఓగా తడకమళ్ల వాసి

మిర్యాలగూడ టౌన్ : మండలంలోని తడకమళ్ల గ్రామానికి చెందిన దేవిరెడ్డి సుమంత్‌రెడ్డి గురువారం వెలువడిన గ్రూప్-1 ఫలితాల్లో ఎంపీడీఓగా ఎంపికయ్యాడు. అతడి తండ్రి వ్యవసాయం చేస్తుండగా తల్లి జ్యోతి మిర్యాలగూడ పట్టణంలోని తాళ్లగడ్డ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పని చేస్తుంది. సుమంత్‌రెడ్డి 1వ తరగతి 7 తరగతి వరకు మిర్యాలగూడలో, 8 నుంచి 10వ తరగతి హైదరాబాద్‌లోని ఎస్‌పీఆర్ ఘట్‌కేసర్‌లో చదివాడు. ఇంటర్మీడియేట్ శ్రీ గాయత్రి హైదరాబాద్, ఇంజనీరింగ్ ఎంవీఎస్ఆర్‌లో పూర్తి చేశాడు. ఆ తరువాత ఢిల్లీలో గ్రూప్-1కు కోచింగ్ తిసుకున్నాడు. ఈ సందర్భంగా దేవిరెడ్డి సుమంత్‌రెడ్డి మాట్లాడుతూ తాను డిప్యూటీ కలెక్టర్ కావాలనే పట్టుదల ఉందన్నారు. తన విజయం వెనుక తన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో పాటు తన స్నేహితుల ప్రొత్సాహంతో విజయం సాధించానని తెలిపారు.



సుమంత్‌రెడ్డి

యూరియా కొరత తీర్చాలి

మాడుగులపల్లి : రాష్ట్రంలో యూరియా కొరత తీర్చాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మాడుగులపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు నాయకులు ఓట్ల కోసం వస్తారే తప్ప రైతుల గోడు వారికి పట్టదన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్, నాయకులు బొమ్మకంటి అంజయ్య, పతాని శ్రీను, చారి, బొంగరాల వెంకటయ్య, ఉరుకొండ శ్రీను, తండు రాజు, ఎలిజాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

మాడుగులపల్లి : ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలని ఎస్‌ఐ కృష్ణయ్య అన్నారు. ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఆదేశాల మేరకు త్రిబుల్ ఆర్ (రోడ్ సేఫ్టీ, రూల్స్, రెస్పాన్సిబులిటి) కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి కుక్కడం గ్రామంలో ప్రజలకు రోడ్డు భద్రత నియమాలపై ఆయన అవగాహన కల్పించి మాట్లాడారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, సీట్ బెల్ట్ ధరించి కార్లు నడపాలని అన్నారు. యువత మాదకద్రవ్యాల బారిన పడి తమ భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. ఆపద సమయంలో 100కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది శ్రీనివాస్, శ్రీనివాస్‌నాయక్, ప్రజలు పాల్గొన్నారు.

తోటి విద్యార్థులతో స్నేహంగా మెలగాలి

త్రిపురారం : కళాశాలలో తోటి విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలగాలని ఎస్‌ఐ గైకూరి నరేష్ సూచించారు. శుక్రవారం కంపాసాగర్ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు ర్యాగింగ్, మత్తు పదార్థాల వల్ల కలిగే అనార్థాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లింగయ్య, కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ చంద్ర శేఖర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నళిని, స్వాతి, లిఖిత పాల్గొన్నారు.

దాడిని ఖండించలేని స్థితిలో కాంగ్రెస్ గిరిజన నాయకులు

మిర్యాలగూడ : గిరిజన యువకుడిని పోలీస్‌స్టేషన్‌లో అకారణంగా తీవ్రంగా కొట్టిన ఎస్‌ఐను వెనుకేసుకురావడమే కాకుండా గిరిజనుడిపై దాడిని ఖండించలేని స్థితిలో కాంగ్రెస్ గిరిజన నాయకులు ఉన్నారని బీఆర్ఎస్ నాయకులు హతిరాం, బాలాజీనాయక్, సేవ్యానాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. వాడపల్లి ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి సాయిసిద్ధు అనే యువకుడిని విపరీతంగా కొట్టడంతో అస్వస్థతకు గురయ్యాడని అన్నారు. గిరిజనుల మధ్య నెలకొన్న సమస్యలను పరిష్కరించకుండా వారి మధ్య చిచ్చు పెడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో దుర్గంపూడి నారాయణరెడ్డి, కుందూరు వీరకోటిరెడ్డి, బైరం సంపత్, రవీందర్ నాయక్, వెంకటేశ్వర్లు, లలిత పాల్గొన్నారు.

ఆది కర్మయోగి శిక్షణ ప్రారంభం

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం దర్తీ ఆబా జెన్ భగీరథి అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆది కర్మయోగి శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీఓ మాతంగి రమేష్ ప్రారంభించి మాట్లాడారు. ఇందుకు ఐదు గ్రామాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. మొల్కచర్ల, చింతచెట్టుతండా, బంగారుకుంటతండా, బాల్నేపల్లి, ఉల్సాయిపాలెం గ్రామాలను ఎంపికచేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ మోసిన్ బిన్ అహ్మద్, ఎంఈవో వరలక్ష్మి, సూపర్‌వైజర్ నాగరాణి, రమణమూర్తి, చిన్ననాయక్, వార్డెన్ లక్ష్మణ్ తదితరులున్నారు.

గిరిజన సంక్షేమమే ధ్యేయం

పెద్దవూర : గిరిజనుల సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని గిరిజన సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి మూడావత్ చత్రు నాయక్ అన్నారు. గిరిజనుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం ధర్తీ ఆబా- ఆది కర్మయోగి అభ్యాస్ పథకంపై శుక్రవారం ఆయన మండలంలోని నీమనాయక్ తండా, పొట్టివానితండా, కుంకుడుచెట్టు తండాల్లో గిరిజన ప్రజలకు అవగాహన కల్పించి మాట్లాడారు. వచ్చే ఐదు సంవత్సరాల్లో దశల వారీగా ఈ పనులను చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి మంగతయారు, ఏపీఎం రాందాస్, కొల్లు బాలకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, నాగేందర్, లింగయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ మాతంగి రమేష్

వర్షానికి కూలిన ఇంటి గోడ

- తప్పిన ప్రమాదం
- శిథిలావస్థకు చేరిన ఇళ్ల యజమానులకు నోటీసులు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడలో కురుస్తున్న వర్షానికి సంతోష్‌నగర్‌లో కోల శ్రీనివాస్‌కు చెందిన ఇంటి గోడ శుక్రవారం తెల్లవారుజామున కూలింది. గోడ కూలిన ఘటనలో శ్రీనివాస్‌కు కాలుకు గాయమైంది. భారీ వర్షానికి పట్టణంలోని 22, 25, 26, 41 వార్డుల్లో పాక్షికంగా దెబ్బతిన్న గృహాలను మున్సిపల్ కమిషనర్ జి. శ్రీనివాస్, మున్సిపల్ డీఈఈ వెంకన్న, తహసీల్దార్ సురేష్‌కుమార్, ఆర్‌ఐ ఠాగూర్ రామకృష్ణ, మున్సిపల్ టీపీఎస్ అంజయ్య, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్, తహసీల్దార్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో శిథిలావస్థలో ఉన్న గృహాలను యాజమానులు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేనియెడల తామె తొలగిస్తామని అన్నారు. శిథిలావస్థకు చేరిన ఇళ్ల కుటుంబాలకు పునరావసం కల్పిస్తామని తెలిపారు. మరింత బహీనమైన గృహాలకు ప్రజా భద్రత కింద నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. వర్షానికి పట్టణంలో మూడు గృహాలు దెబ్బతిన్నట్లు తెలిపారు. అదే విధంగా గోడ కూలిన ఇంటిని బీజేపీ సీనియర్ నేత వనం మధన్‌మోహన్ పరిశీలించి బాధిత కుటుంబాన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

చెరువును తలపించేలా..

మిర్యాలగూడలో గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు కురిసిన భారీ వర్షానికి సబ్ జైలు రోడ్డులో గల శ్రీలక్ష్మీదేవి ఆలయం వద్ద చెరువును తలపించేలా వర్షపు నీరు నిలిచింది. అమ్మవారి టెంపుల్‌లోకి నీరు చేరడంతో ప్రధాన పూజారి శుభ్రం చేసి పూజలు జరిపారు. ఈ అమ్మవారి టెంపుల్ పక్కన దుర్గామాత మండపం వద్ద కూడా నీరు నిలిచింది. మహిళలు వర్షంలోనే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సంతోష్‌నగర్‌లో కూలిన ఓ ఇంటి గోడ

ఘనంగా బతుకమ్మ వేడుకలు



బతుకమ్మలతో సూపర్‌వైజర్ లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు

మాడుగులపల్లి : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద పోషణ మాసోత్సవంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు బతుకమ్మలను అందంగా పేర్చి ఆడిపాడారు. సూపర్‌వైజర్ లక్ష్మీ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలి

మిర్యాలగూడ : పట్టణంలోని తాళ్లగడ్డ సమీపంలో చెరువు శిఖం, ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయని, అధికారులు స్పందించి అక్రమ కట్టడాలను తొలగించి భూములను స్వాధీనం చేసుకోవాలని సామాజిక కార్యకర్త దేవులపల్లి కార్తీక్‌రాజు కోరారు. ఈమేరకు శుక్రవారం మిర్యాలగూడలో సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. తాళ్లగడ్డ సమీపంలోని సర్వే నంబర్ 60, 61లలో ప్రభుత్వ సీలింగ్ భూమి, సర్వే నంబర్ 118, 519లలో చెరువు శిఖం భూములను కొందరు ఆక్రమించి కట్టడాలు చేపడుతున్నారని తెలిపారు. అక్రమ నిర్మాణాలను తొలగించి కబ్జాదారులపై కేసులు నమోదు చేయాలని ఆయన కోరారు.